05082024-DIS-08_Layout 1 8/5/2024 1:57 AM Page 1

చందుర్తి సొసైటీలో రుణమాయ

- బినామీ రైతుల పేరిట రుణాలు
- సహకార సంఘ సిబ్బంది నిర్వాకం
- మాఫీతో బట్టబయలైన వ్యవహారం

చందుర్తి,ఆగస్టు 4: చందుర్తి సొసైటీ అక్రమాలకు అడ్డాగా తయారైంది. సిబ్బంది నిర్వాకం రైతాంగానికి శాపంగా మారింది. ఇటీవల సర్కారు రుణమాఫీ చేయడంతో వారి అక్రమ వ్యవహారం బట్టబయలైంది. బినామీ రైతుల పేరిట రుణాలు తీసుకున్నట్లు తేటతేల్లమైంది. ఉన్నతాధికారుల విచారణలో సుమారు రూ.కోటి వరకు పక్కదారి పట్టినట్లు తెలుస్తున్నది. సొసైటీ సిబ్బంది నిర్వాకంతో అనేక మంది రైతులు రుణమాఫీకి దూరమయ్యారు.

మహిళ పేరిట రుణం స్వాహా

మూడపల్లికి చెందిన ఓ మహిళ పేరిట ఆమెకు తెలియకుండానే రూ.78 వేలు పంట రుణం తీసుకున్నారు. ఇటీవల విడుదల చేసిన రుణమాఫీ జాబితాలో ఆమె పేరు ఉండడంతో అవాక్కయింది. వెంటనే అధికారులను నిలదీస్తే సొసైటీ నేతలు ఆమెను బుజ్జగిస్తున్నట్లు సమాచారం. ఇలా ఒక మహిళే కాకుండా చాలా మంది పేరున రుణం స్వాహా చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రుణం తీసుకునే క్రమంలో రైతుల ఆధార్ కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకుని సదరు రైతులకు రుణం మంజూరు చేయకుండా సదరు కాగితాలతో అక్రమాలకు తెరలేపగా సూత్రధారులు, పాత్రధారులు ఎవరన్నది తేలాల్సి ఉన్నది.

అక్రమాలు జరిగింది ఇలా

సొసైటీ పరిధిలో మండలంలోని 8 గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. అయితే, వీరి స్థానంలో వేరే వారి పేర్లు ఉండడం, ఆధార్ కార్డు నంబర్లు ఒకరికి బదులు మరొకరివి ఉండడం, 2009లోనే మూసివేసిన ఖాతాలో మళ్లీ అప్పు ఉన్నట్లు చూపించడం, అసలు అప్పు తీసుకొని వారి మీద సైతం ఎంతోకొంత రుణం ఉన్నట్లు చూపించడం రైతులను ఆందోళనకు గురిచేస్తున్నది. ఇలా సుమారు కోటి రూపాయల వరకు అవకతవకలు జరిగినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గతంలో రుణమాఫీ జరిగినప్పుడు ఇది చిన్నసమస్యనే అనుకున్నామని ఇందులో తవ్వినకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయని, ఇప్పుడే ఇలా ఉంటే ఇక రూ.2లక్షల రుణమాఫీ జరిగితే ఇంకెన్ని విచిత్రాలుచూడాల్సి వస్తుందోనని రైతులు చర్చించుకుంటున్నారు.

నా ఆధార్ నంబర్ వేరే వ్యక్తిపై ఉన్నది

నేను పదేండ్ల నుంచి క్రాప్ లోన్ తీసుకుంటూ రెన్యువల్ చేయించుకుంటున్నా. ఇటీవల రుణమాఫీ లిస్ట్‌లో పేరు రావడంతో బ్యాంకుకు వెళ్లిన. అక్కడ నా ఆధార్ కార్డు నంబర్ ను వేరే వ్యక్తి రాంరెడ్డి నారాయణరెడ్డి పేరుపై సొసైటీ వారు నమోదు చేశారు. ఇదేందని అడిగితే సాకులు చెబుతున్నారు.

-ఏరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రైతు మర్రిగడ్డ

సాంకేతిక లోపం వల్లే

రుణమాఫీలో తప్పిదాలు జరిగిన మాట వాస్తవమే. సాంకేతిక లోపం వల్లే ఇదంతా జరిగింది. సమస్యను పరిష్కరించి ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా చూస్తాం. మరోసారి ఇలాంటి పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- ఫ్యాక్స్ సీఈవో గంగారెడ్డి

రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల పంట

- ఆషాడమాసంలోనూ ఫుల్ రష్
- జూలై ఒక్క నెలలో ₹32.29కోట్ల రాబడి
- చార్జీలు పెంపుదలకు సర్కారు కసరత్తు
- క్రయ, విక్రయదారుల ముందస్తు జాగ్రత్తతోనే పెరిగిన రాబడి

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో రెండు నెలలుగా భారీగా రిజిస్ట్రేషన్లు

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ పంట పండింది. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గత రెండు నెలల్లోనే కాసుల వర్షం కురిసింది. చార్జీల పెంపుదలకు సర్కారు కసరత్తు చేస్తుండడంతో క్రయ, విక్రయదారుల ముందస్తు జాగ్రత్తతో తాకిడి పెరుగుతున్నది. గత జూన్‌లో ₹23.79కోట్లు రాగా, ఆషాఢమాసంలోనూ రద్దీకొనసాగింది. జూలై ఒక్క నెలలోనే గణనీయమైన రిజిస్ట్రేషన్లతో ₹32.29కోట్ల రాబడి రాగా, ఆ శాఖలో ఆనందం వ్యక్తమవుతున్నది.

- కరీంనగర్ కలెక్టరేట్, ఆగస్టు 4

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కార్యాలయం

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు ఉమ్మడి జిల్లాలో ఆదాయం గణనీయంగా పెరిగింది. ఉమ్మడి జిల్లా పరిధిలో మొత్తం 14 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా, గత జూన్‌లో ఆయా కార్యాలయాల పరిధిలో 7,280 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. మొత్తం రూ.23.79కోట్ల 78 లక్షల ఆదాయం వచ్చింది. వీటిలో కరీంనగర్ సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో అత్యధికంగా 1,014 డాక్యుమెంట్లు చేయగా, రూ.5కోట్ల 94 లక్షల 7వేల ఆదాయం వచ్చింది. ఇక జగిత్యాల ఎస్ఆర్‌వో పరిధిలో 745 డాక్యుమెంట్లకు రూ.2కోట్ల 28లక్షల 87వేలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. అలాగే జూలై నెలలో కరీంనగర్ ఎస్ఆర్‌వో పరిధిలో 1,256 డాక్యుమెంట్లు చేయగా, రూ.6కోట్ల 99లోల 83వేలు, సిరిసిల్లలో 1,168 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లతో రూ.2కోట్ల 49లక్షల 3వేల ఆదాయం వచ్చినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జూలై నెలలో ఉమ్మడి జిల్లా పరిధిలో 9,527 డాక్యుమెంట్లు చేయగా, గత జూన్‌తో పోల్చితే ₹9కోట్లు అదనంగా పెరిగి ₹32.29కోట్ల పైచిలుకు ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

చార్జీల పెంపునకు ప్రభుత్వానికి నివేదిక

ప్రభుత్వం నెలవారీ ఆదాయాన్ని పెంచుకునే క్రమంలో రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచే ఆలోచనలో ఉన్నట్లు అధికారుల చర్యల ద్వారా స్పష్టమవుతోంది. గత కొద్ది రోజులుగా ఈ శాఖలోని పలు కేటగిరీలకు చెందిన అధికారులు భూముల ధరలపై మదింపు చేస్తున్నారు. మార్కెట్‌లో డిమాండ్‌కు తగ్గట్లు రిజిస్ట్రేషన్ చార్జీలు లేకపోవడంతో చార్జీల పెంపు దిశగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆయా ఎస్ఆర్‌వోల పరిధిలో భూముల డిమాండ్ ఉన్న పట్టణాల్లో అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేపట్టి, పూర్తి స్థాయి నివేదికలు ప్రభుత్వానికి పంపారు. వీటిని అనుసరించి రిజిస్ట్రేషన్ల ధరలు కూడా పెంచేందుకు ప్రభుత్వం అంతర్గతంగా కసరత్తు చేస్తున్నట్లు పలువురు మంత్రులు చేస్తున్న వ్యాఖ్యలను బట్టి స్పష్టమవుతోంది. ఈ క్రమంలో క్రయ, విక్రయదారులు కూడా ముందు జాగ్రత్త పడుతూ, చార్జీలు పెరుగకముందే రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. వాస్తవానికి ఆషాడమాసంలో రిజిస్ట్రేషన్ల సంఖ్య తక్కువగా ఉంటుంది. అయితే, జరుగుతున్న పరిణామాలతో భూములు కొనుగోలు చేసిన వారంతా అదనపు భారం కోసం వేచిచూడకుండా, ముందస్తుగా అప్రమత్తమవుతున్నారు. శ్రావణమాసం ప్రారంభమవడంతో ఆగస్టు నెలలో రిజిస్ట్రేషన్ల సంఖ్య ఇంకా పెరగడంతో పాటు రెట్టింపు ఆదాయం వస్తుందని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు అంచనాల్లో ఉన్నారు.

వెదజల్లి.. వరి సాగు చేసి..

- ఆసక్తి చూపుతున్న రైతులు
- కూలీల కొరతకు చెక్

వెదజల్లే పద్ధతి ద్వారా సాగవుతున్న వరి

తిమ్మాపూర్, ఆగస్టు 4 : పంటల్లో దిగుబడి పెరిగి లాభాలు వస్తున్నా.. పెట్టుబడి రైతుకు తడిసి మోపెడు అవుతోంది. దానికితోడు మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో రైతు కూలీల కొరత కూడా ఉంటుంది. వానకాలం సాగు ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో నాట్ల జోరు కొనసాగుతున్నది. ఈ క్రమంలో కూలీల అవసరం లేకుండా.. తక్కువ ఖర్చులో వెదజల్లే పద్ధతిలో కొంత మంది రైతులు వరిసాగు చేస్తున్నారు. గతంలో సాగు చేసిన రైతులను ఆదర్శంగా తీసుకుని మరి కొంతమంది రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

సీడ్ తక్కువే..

సాధరణంగా నారు పోసిన తర్వాత నాటు వేస్తే ఎకరానికి 30 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. అదే ఈ విధానంలో అయితే 12-15 కిలోల విత్తనాలు సరిపోతాయి.

ఇలా చేయాలి...

వెదజల్లే మడిని సమాంతరంగా చేసుకోవాలి. మొలక వచ్చిన గింజలను ఒకే నమూనా చల్లుకోవాలి. వెదజల్లే వ్యక్తికి అనుభవం ఉంటే విత్తనం సమాంతరంగా పడే అవకాశం ఉంటుంది. అలాగే, ఈ పద్ధతిలో ఇద్దరు వ్యక్తులు రోజుకు మూడు, నాలుగు ఎకరాల్లో విత్తనం చల్లుకోవచ్చు. ఈ విధానం డ్రమ్ సీడర్‌లాగే ఉంటుంది.

నీళ్లు కూడా తక్కువే..

వానకాలమైనా ఇంకా వర్షాలు పూర్తి స్థాయిలో పడనేలేదు.. ఎన్ని నీళ్లు ఉన్నా చివరివరకు భూగర్భజలాలు తగ్గడంతో పాటూ ఎండలు పెరగడంతో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉంటుంది. ఈ విధానంలో సాగు చేయడం వల్ల పంటకాలం తగ్గి, త్వరగా చేతికి వచ్చే అవకాశం ఉంటుంది.

ఖర్చు ఆదా..

రైతులు ఎకరం నాటు వేయడానికి 10 మంది వరకు కూలీలు అవసరం పడుతుండగా ప్రాంతాన్ని బట్టి ఒక్కో కూలికి రూ. 350-400 వరకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఒక్క ఎకరానికి రూ.3-5 వేల వరకు ఖర్చు వస్తున్నది. ఈ పద్ధతి ద్వారా అయితే రూ. వెయ్యి లోపు పూర్తవుతుంది.శారీరక శ్రమ తగ్గుతుంది. అంతే కాకుండా, విత్తనం విడివిడిగా పడడం వల్ల పిలకలు పెరిగి, దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతుల ద్వారా సాగు చేసే రైతులను ప్రోత్సహిస్తున్నాం. వారికి తగిన సూచనలు, సలహాలను అందిస్తున్నాం. వరి విత్తనం వేసిన నాటి నుంచి పంట కోత వరకు దాని ఎదుగుదల, దిగుబడిని పరిశీలిస్తూ వచ్చాం. వెదజల్లే పద్ధతుల్లో సాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ విధానంలో సాగు చేసే రైతుల సంఖ్య గతం కంటే పెరిగింది. ఈ పద్ధతిలో సాగు చేసేవారు మమ్మల్నైనా, విస్తరణ అధికారులను అయినా, సాగు చేస్తున్న రైతులతో అవగాహన పెంచుకుని సేద్యం చేయడం ఉత్తమం. యాజమాన్య పద్ధతులు పాటిస్తే దిగుబడి పెంచుకోవచ్చు.

- జే సురేందర్, వ్యవసాయాధికారి, తిమ్మాపూర్

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

- సంస్థ యాజమాన్యం దిష్టిబొమ్మ దహనం

కోల్‌సిటీ, ఆగస్టు 4 : అగ్రిగోల్డ్ ఆస్తులు వేలం వేసి బాధితులకు ప్రభుత్వం డబ్బులు చెల్లించి న్యాయం చేయాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడుమద్దెల దినేష్ కోరారు. ఈ మేరకు ఆదివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో బాధితుల ఆధ్వర్యంలో ర్యాలీ తీసి యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖనిలో అగ్రిగోల్డ్ సంస్థలో ఏజెంట్ల ద్వారా దాదాపు 3 వేల మంది బాధితులు మోసపోయారని, ఒక్కొక్కరికి రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రావాల్సి ఉందన్నారు. సంస్థ నిర్వాహకులు జనాల సొమ్ముతో జల్సా చేసి దివాలా తీసి బాధితులు ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపించారన్నారు. ఇన్వెస్ట్‌మెంట్ డబ్బులు రాక ఆర్థికంగా, మానసికంగా కుంగిపోయి అనారోగ్యాల బారిన పడుతున్నారన్నారు. రాష్ట్రంలోని అగ్రిగోల్డ్ ఆస్తులను ప్రభుత్వమే జప్తు చేసి రూ.420 కోట్లు బాధితులకు చెల్లించాలని, చనిపోయిన బాధితులకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ కాంట్రాక్ట్ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ గౌస్, కొమ్ము చందు యాదవ్ పాల్గొన్నారు.

గోదావరిఖని చౌరస్తాలో అగ్రిగోల్డ్ సంస్థ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బాధితులు

సినారె పురస్కారానికి ఎంపిక

కమాన్‌చౌరస్తా, ఆగస్టు 4 : మహాకవి సినారె సాహిత్య కళాపీఠం అందజేస్తున్న సినారె సాహిత్య పురస్కారానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన కవులు సంగెవేని రవీంద్ర, బూర్ల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. ఈ మేరకు కళాపీఠం అధ్యక్షుడు మల్లెకేడి రాములు, సమన్వయకర్త పోరెడ్డి రంగయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని ఏబీఆర్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు పురస్కార ప్రదానం ఉంటుందని తెలిపారు.

రుణానికి బీమా రక్ష

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ ప్రయోజనాలెన్నో..

గృహ రుణం అంటే దీర్ఘకాల అప్పు. దీన్ని చెల్లించేటప్పుడు అనేక ఒడిదొడుకులు సహజం. అందుకే ఈ రుణానికి బీమా రక్షణ ఇవ్వడం తెలివైన పని అనిపించుకుంటుంది. అప్పుడే మనకు, మన కుటుంబ సభ్యులకు ప్రశాంతత అనేది ఉంటుంది. నిజానికి రుణం తీసుకుంటే దానికి బీమాను కూడా తీసుకోవాలని అటు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ)గానీ, ఇటు బీమా రంగ రెగ్యులేటర్ ఐఆర్‌డీఏఐగానీ చెప్పడం లేదు. అయితే మన లాభం కోసం, మన కుటుంబ సభ్యులకు రుణ భారం లేకుండా ఉండేందుకు బీమా తీసుకోవడం ఉత్తమం.

హోమ్ లోన్ ఇన్సూరెన్స్ అంటే?

హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను హోమ్ లోన్ ప్రొటెక్షన్ ప్లాన్ (హెచ్ఎల్‌పీపీ) అని కూడా పిలుస్తారు. ఈ స్కీమ్‌లను అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేట్ బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థలన్నీ అందిస్తున్నాయి. మరణం, ఆరోగ్యం పాడైపోయి, ఏదైనా కారణం చేత అవయవాలు కోల్పోయి పనిచేయలేని స్థితికి రుణగ్రహీత చేరితే రుణ చెల్లింపుల సంగతిని బీమా సంస్థే చూసుకుంటుంది.

గృహ రుణ బీమా ప్రాముఖ్యత

రుణమిచ్చే బ్యాంకులు లేదా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు.. తమ రుణాలు మొండి బకాయిలుగా మిగిలిపోవాలని చూడవు. అందుకే రుణం తీసుకునేటప్పుడే దానికి బీమా కూడా తీసుకోవాలని రుణగ్రహీతకు ఆయా సంస్థలు చెప్తాయి. దాని ప్రాధాన్యతనూ వివరిస్తాయి. పైగా ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా మునుపెన్నడూ లేనివిధంగా విజృంభించిన కరోనా మహమ్మారి.. మానవుల జీవితాలను ఎంతో ప్రభావితం చేసింది. ఆరోగ్యపరంగా, ఆర్థికపరంగా ఎన్నో విధాలుగా వెనక్కినెట్టింది. ఇలాంటి పరిస్థితుల్లో రుణ బీమా మన కుటుంబాలకు రక్షగా ఉంటుంది. దురదృష్టవశాత్తు చనిపోయినా, పూర్తిగా అంగవైకల్యం బారినపడ్డా బీమా సంస్థే మన రుణ చెల్లింపుల్ని చేస్తుంది. దీనివల్ల మనం లేనిరోజున మనవాళ్లకు కనీసం సొంత ఇల్లైనా దక్కుతుంది. అలాగే ఉద్యోగం కోల్పోయినా ఆసరాగా ఉంటుంది. అయితే స్టాండర్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను తీసుకోవాలి. మొక్కుబడిగా కాకుండా అన్ని ఫీచర్లున్న బీమాను కొనాలన్నది మర్చిపోవద్దు.

గుర్తుంచుకోండి..

ప్రీమియంలు

గృహ రుణ బీమా కవరేజీ ప్రీమియంను ఒకేసారి మొత్తంగా చెల్లించవచ్చు. లేదా హోమ్ లోన్ ఈఎంఐలతోపాటు నెలనెలా కొంత మొత్తాల్లోనూ చెల్లించవచ్చు.

జాయింట్ హౌజ్ లోన్

సంయుక్త గృహ రుణగ్రహీతలకూ ఈ బీమా ఉపయుక్తంగా ఉంటుంది. కో-అప్లికెంట్స్ అందరికీ ఇది వర్తిస్తుంది. అందువల్ల ఒకవేళ కుటుంబంలోని ముగ్గురు కలిసి రుణాన్ని తీసుకున్నా.. వారిలో దురదృష్టవశాత్తు ఒక్కరు అకాల మరణం పాలైనా బీమా కవరేజీని పొందవచ్చు.

రైడర్స్-యాడ్ ఆన్స్

బేసిక్ గృహ రుణ బీమాలో రుణగ్రహీత చనిపోతే చెల్లుబాటు అవుతుంది. అయినప్పటికీ రైడర్ స్కీమ్‌ను యాడ్ చేసుకోవాలంటే అదనపు ప్రీమియం చెల్లించాల్సిందే. రుణగ్రహీతకు గుండెపోటు, క్యాన్సర్, ఇతర ప్రమాదకర గాయాలపాలైనా బీమా వర్తించగలదు. అంగవైకల్యానికి గురైనా లేదా ఉద్యోగం కోల్పోయినా, ఉపాధి కరువైనా 6 నెలలదాకా ఈఎంఐ చెల్లింపులకు యాడ్ ఆన్స్ కవరేజీని ఇవ్వగలవు.

బీమాలో రకాలు..

హైబ్రిడ్ ప్లాన్లు

హైబ్రిడ్ కవర్ ప్లాన్లలో బీమా కవరేజీ మొత్తం తొలి ఏడాది స్థిరంగా ఉంటుంది. అయితే రెండో ఏడాది నుంచి క్రమేణా కవరేజీ తగ్గిపోతూ ఉంటుంది. గృహ రుణ బకాయి మొత్తాలు కూడా తగ్గుతుండటమే దీనికి కారణం.

లెవల్ కవర్ ప్లాన్లు

గృహ రుణం కాల వ్యవధి ఎప్పటిదాకా ఉంటుందో అప్పటిదాకా ఈ లెవల్ కవర్ ప్లాన్లలో బీమా ప్రయోజనాలు స్థిరంగా ఉంటాయి. రుణ మొత్తాలు తగ్గుతున్నంత మాత్రాన బీమా కవరేజీ తగ్గిపోదు. కాబట్టి ముందే ఆలోచించి ప్లాన్లపై ఓ నిర్ణయం తీసుకోవాలి.



ప్రయోజనాలివే..

పన్ను ప్రోత్సాహకాలు

గృహ రుణగ్రహీతలు.. హోమ్ లోన్ ఇన్సూరెన్స్‌ను కూడా తీసుకోవడం వల్ల పన్ను ప్రోత్సాహకాలను అందుకోవచ్చు. ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80సీ కింద బీమా కోసం చెల్లించే ప్రీమియంలను పన్ను మినహాయింపునకు కోరవచ్చు.

కుటుంబ రక్షణ

కుటుంబ పెద్ద అకాల మరణం పాలైనప్పుడు.. గృహ రుణ భారం ఆ కుటుంబ సభ్యులపై పడకుండా హోమ్ లోన్ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. కాబట్టి రుణం తీసుకున్నప్పుడు దానికి బీమా కూడా తీసుకోవడం తెలివైన నిర్ణయమే అవుతుంది.

చివరగా.. ఇన్సూరెన్స్ ప్రీమియంలను రుణ మొత్తం, రీపేమెంట్ టెన్యూర్, రుణగ్రహీత వయస్సు, ఆరోగ్య పరిస్థితులు ప్రభావితం చేయగలవు. అలాగే ఎలాంటి పరిస్థితుల్లో బీమా వర్తిస్తుంది. అత్యుత్తమ బీమా కవరేజీనే తీసుకుంటున్నామా? అన్నదీ పరిశీలించుకోవాలి. క్లెయిమ్ సెటిల్మెంట్లు, పేమెంట్ పద్ధతిని కూడా కనుక్కోవడం మంచిది.

రాబడి

క్రెడిట్ కార్డ్ కావాలా.. నాయనా!

బ్యాంకుల్లో, పెట్రోల్ బంకుల్లో, షాపింగ్ మాల్స్‌లో క్రెడిట్ కార్డ్ కావాలా? అంటూ అడిగితే.. ఊ కొడుతూ వెళ్లే ముందు ఇదికాస్త ఆలోచించుకోండి. మీరు తీసుకునే క్రెడిట్ కార్డ్‌కు సంబంధించిన నియమ, నిబంధనలను పూర్తిగా చదవడం మర్చిపోవద్దు. దానిపై పొందే నగదు మొత్తాలకుపడే వడ్డీరేట్లు, ఇతర ఫీజులు, చార్జీలను తెలుసుకోకుంటే నష్టపోతారు. బ్యాంకింగ్ కస్టమర్ల ప్రయోజనార్థం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు సందేశాలను కూడా ఇస్తుండటం గమనార్హం. ఇక క్రెడిట్ కార్డ్‌ను పూర్తిస్థాయిలో వాడుకోకపోవడమే మంచిది. అలాగే వాడుకున్న మొత్తాలను కొద్దికొద్దిగా చెల్లించడం కాకుండా పూర్తిగా చెల్లిస్తేనే వడ్డీభారం పడబోదని గుర్తుంచుకోవాలి.

ఒడిదొడుకులకు ఆస్కారం

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు గత వారం వరుస లాభాల్లో కదలాడాయి. అయితే చివర్లో నష్టాలు దెబ్బతీశాయి. ఆఖరిరోజు శుక్రవారం భారీగా క్షీణించాయి. మదుపరులు ఒక్కసారిగా అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో ఓవరాల్‌గా గత వారం మార్కెట్లు నష్టాలకే పరిమితం కావాల్సి వచ్చింది. ఫలితంగా అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 350.77 పాయింట్లు కోల్పోయి 80,981.95 వద్ద స్థిరపడింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 117.15 పాయింట్లు దిగజారి 24,717.70 దగ్గర నిలిచింది. నిజానికి గత వారం తొలిసారి సెన్సెక్స్ 82,000 మార్కును, నిఫ్టీ 25,000 మార్కును దాటాయి. ఇదిలావుంటే ఈ వారం ఒడిదొడుకులకు ఎక్కువగా ఆస్కారం కనిపిస్తున్నది. ఇజ్రాయెల్-హమాస్ నడుమ ఉద్రిక్తతల్ని మరింత పెంచేలా అమెరికా జోక్యం కలవరం పుట్టిస్తున్నది. అలాగే మదుపరులు ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) మూడో ద్వైమాసికానికిగాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రకటించే ద్రవ్యవిధాన పరపతి సమీక్ష ఆధారంగా నిర్ణయాలు తీసుకునే అవకాశాలున్నాయి. గురువారం ఆర్బీఐ తమ పాలసీని ప్రకటించనున్నది. సుదీర్ఘకాలంగా వడ్డీరేట్లను యథాతథంగానే సెంట్రల్ బ్యాంక్ ఉంచుతున్నది తెలిసిందే. ద్రవ్యోల్బణం అదుపే లక్ష్యంగా ఈ విధానాన్ని అనుసరిస్తున్నది. అయితే ఇప్పటికీ ధరాఘాతం కొనసాగుతున్నది. దీంతో రాబోయే సమీక్షలో వడ్డీరేట్లపై ఆర్బీఐ ఏం నిర్ణయం తీసుకుంటుందన్నదే కీలకం. ఒకవేళ ఎప్పట్లాగే వడ్డీరేట్ల జోలికి వెళ్లకుండానే సమీక్ష ముగిస్తే.. ఆటో, బ్యాంకింగ్, స్టీల్, రియల్టీ, దాని అనుబంధ రంగాల షేర్లు సెల్లింగ్ ప్రెషర్‌ను ఎదుర్కోవచ్చు. వడ్డీరేట్లు తగ్గితే మాత్రం ఈ రంగాల్లోని సంస్థల షేర్లన్నీ లాభాలను సంతరించుకునే వీలున్నది. కాగా, గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. ఇక అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,500 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,100-25,200 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

ఇల్లు కొంటున్నారా?

పీఎంఏవై పథకంలో వడ్డీ రాయితీ పొందండిలా

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం మళ్లీ వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరానికి (2024 -25)గాను గత నెల పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన బడ్జెట్‌లో దీన్ని తిరిగి తీసుకొచ్చారు.

ఏమిటీ పీఎంఏవై?

ఈ పథకం 2015లో మొదలైంది. దేశంలోని అన్ని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి వర్గాలకు పక్కా గృహాలు, కనీస వసతుల్ని కల్పించడమే ఈ క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం లక్ష్యం. అర్హులైన లబ్ధిదారులకు ఇండ్ల నిర్మాణం కోసం ఇందులో పీఎంఏవై-గ్రామీణ్, పీఎంఏవై-అర్బన్ పేరిట రెండు విభాగాలున్నాయి. ఇంటి నిర్మాణం, కొనుగోలు కోసం తీసుకునే రుణాలపై చెల్లించే వడ్డీలో రాయితీ ప్రయోజనాన్ని పీఎంఏవై అందిస్తుంది.

ఎవరు అర్హులు?

- వార్షిక ఆదాయం రూ.3 లక్షలదాకా ఉన్న ఆర్థికంగా వెనుకబడిన తరగతులవారు.
- రూ.3-6 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న అల్పాదాయ వర్గాలు.
- రూ.6-12 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న మధ్యతరగతి ప్రజానీకం.
- రూ.12-18 లక్షల మధ్య వార్షిక ఆదాయం ఉన్న ఎగువ మధ్యతరగతి కుటుంబాలు.
- పీఎంఏవై దరఖాస్తుదారులు భారతీయులై ఉండాలి. దేశంలో మరెక్కడా వారికి సొంతిల్లు ఉండరాదు.
- కేంద్ర ప్రభుత్వం ద్వారా మరే ఇతర గృహ సంబంధిత పథకాల ప్రయోజనాలను గతంలో పొంది ఉండకూడదు.

ఇదీ సంగతి..

- నిర్ణీత వైశాల్యాల్లోని నివాసాలకే పథకం.
- మహిళలకు తక్కువ వడ్డీరేటుకే రుణాలు.
- రుణం ఎంత మొత్తమైనా తీసుకోవచ్చు. కానీ ఈ పథకం ప్రయోజనం సదరు రుణ మొత్తంలో రూ.12 లక్షల వరకే వర్తిస్తుంది.
- గరిష్ఠంగా రూ.2.67 లక్షలదాకా సబ్సిడీ.
- ఇల్లు పూర్తిగా మహిళ పేరిటగానీ, లేదా సహ యజమానిగానైనా స్త్రీలుండాలి.
- స్టాంప్ డ్యూటీ తగ్గింపు, పన్ను మినహాయింపులు, రిజిస్ట్రేషన్ చార్జీల్లో కోతలు.
- మహిళలకు రుణంపై రూ.1.5 లక్షల దాకా, వడ్డీపై రూ.2 లక్షల వరకు పన్ను మినహాయింపు. దంపతులిరువురికీ ఆదాయం ఉన్నట్లైతే ఈ ప్రయోజనం రూ.3 లక్షలు, రూ.4 లక్షలదాకా ఉండటం విశేషం.

దరఖాస్తు ఇలా..

ఆన్‌లైన్‌లోనైతే అర్హులు తొలుత పీఎంఏవై అధికారిక వెబ్‌సైట్‌కు వెళ్లాలి. ఆపై 'సిటిజన్ అసెస్‌మెంట్', 'బెనిఫిట్స్ అండర్ అదర్ 3 కాంపోనెంట్స్'లపై క్లిక్ చేయాలి. ఆ తర్వాత ఆధార్ వివరాలిస్తే దరఖాస్తు ఫారం వస్తుంది. అందులో అన్ని వివరాలను నింపితే సెక్